

కిరండోల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

విశాఖపట్నం, జనవరి 29: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లకు ఫిబ్రవరి రెండో తేదీ నుంచి అదనంగా ఒక విస్టాడోమ్ కోచ్‌ను జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-కిరండోల్ రైలుకు (08551) ఫిబ్రవరి రెండు నుంచి మార్చి 31వ తేదీ వరకు ప్రతి శుక్ర, శని, ఆదివారం, తిరుగు ప్రయాణంలో కిరండోల్-విశాఖ రైలుకు (08552) ఫిబ్రవరి మూడు నుంచి ఏప్రిల్ ఒకటి వరకు ప్రతి శని, ఆది, సోమవారాల్లో ఈ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

వైసీపీ కేడర్‌లో అసంతృప్తి సెగలు

పార్టీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లయినా తమకు ఒనగూరిందేమీ లేదంటూ ఆగ్రహం


సంగివలసలో వైసీపీ సభ (ఫైల్)

స్థానిక నాయకత్వంపై తీవ్ర అసహనం

- సభలు, సమావేశాలకు హాజరవ్వడం తప్ప ఇల్లు కూడా పొందలేకపోయానని వాపోయిన ఒక కార్యకర్త
- తమ ఎమ్మెల్యేలు ఓడిపోతారంటూ వ్యాఖ్యలు
- ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోవడం, రోడ్లు బాగుండకపోవడం పార్టీకి మైనస్ అవుతుందన్న 'చోడవరం' కార్యకర్త
- 'నెల్లిమర్ల', 'చోడవరం' నియోజకవర్గాల్లో కష్టమే
- బేబీ నాయనకు 'శంబంగి' ఎదురు నిలవలేరన్న 'బొబ్బిలి' కార్యకర్త
- షర్మిల వల్ల నష్టపోతామనే అంచనాలో కార్యకర్తలు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ నేతల తీరుపై సామాన్య పౌరుల్లోనే కాదు... ఆ పార్టీ కేడర్‌లోనూ అసంతృప్తి నెలకొని ఉంది. పార్టీ అధికారంలోకి వచ్చినా అధినేత జగన్మోహన్‌రెడ్డి గానీ, స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు గానీ తమకు ఏమీ చేయలేదన్న భావన మెజారిటీ కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. కొన్ని నియోజక వర్గాల్లో స్థానిక నాయకత్వంపై పార్టీ శ్రేణులు ఆగ్రహంతో ఉండడం కనిపించింది.

రెండు రోజుల క్రితం భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలసలో నిర్వహించిన సభకు హాజరైన కార్యకర్తలను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు కదిలించినప్పుడు..తమలో దాగి ఉన్న అసంతృప్తిని బయట పెట్టారు. కొంతమంది సీఎం జగన్మోహన్‌రెడ్డి తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తుండగా, మరికొంతమంది తమ ఎమ్మెల్యేలపై అసంతృప్తితో ఉన్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే బద్దుకొండ అప్పలనాయుడు అయితే ఈసారి ఓడిపోవడం ఖాయమని ఆ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ప్రతిపక్షాలు సరైన అభ్యర్థిని బరిలోకి దింపితే విజయావకాశాలు పుష్కలంగా ఉంటాయని నియోజకవర్గానికి చెందిన శ్రీరాములు అనే కార్యకర్త అభిప్రాయపడ్డారు. అప్పలనాయుడు అయితే ఈసారి తప్పనిసరిగా ఓడిపోతాడంటూ మరో కార్యకర్త పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థికి పతివాడ నారాయణస్వామి నాయుడు సహకరిస్తే అక్కడ గెలుపు ప్రతిపక్షాలకు సులభం అవుతుందని మరో కార్యకర్త పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లా చోడవరంలో ప్రస్తుతం గట్టి పోటీ నెలకొందని ఆ నియోజకవర్గానికి చెందిన ఒక కార్యకర్త వెల్లడించారు. ప్రస్తుతం సమంగా ఉన్నట్టు కనిపిస్తోందని, ఈ పరిస్థితి మారిపోయే చాన్స్ ఉందని జోగినాయుడు అనే మరో కార్యకర్త తెలిపారు. చోడవరంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మశ్రీ గెలిచే అవకాశాలు దాదాపు లేవని మరో కార్యకర్త తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇక్కడ వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మంచి అవకాశం ఉందని రామారావు అనే కార్యకర్త చెప్పారు. ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేక పోవడం, రోడ్లు బాగుండకపోవడం స్థానికంగా పార్టీకి మైనస్‌గా ఉందని మరో కార్యకర్త వాపోయారు. జగన్ వరకూ పర్వాలేదని, స్థానికంగా ఎమ్మెల్యే పనితీరు ఆశాజనకంగా లేదంటూ అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి వచ్చిన కార్యకర్త అన్నారు.

విజయనగరం జిల్లా బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినవెంకట అప్పలనాయుడుకు క్లిష్ట పరిస్థితులు కనిపిస్తున్నాయని, తెలుగుదేశం నాయకుడు బేబీ నాయన ప్రజల్లోకి దూసుకువెళుతూ ఆదరణ పొందుతున్నారంటూ ఆ నియోజకవర్గానికి చెందిన కృష్ణ అనే కార్యకర్త పేర్కొన్నారు. బొబ్బిలి నుంచి సమావేశానికి ... మిగతా 8వ పేజీలో

గ్రామ కంఠం కబ్జా


కె.కె.అగ్రహారంలో వైసీపీ నేతలు ఆక్రమించి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన గ్రామకంఠం స్థలం ఇదే

కె.కె.అగ్రహారంలో వైసీపీ నేతలు భూదందా

- రెవెన్యూ అధికారులతో కుమ్మక్కు
- 60 సెంట్ల స్థలం ఆక్రమణ
- రెవెన్యూ రికార్డుల్లో విశాఖకు చెందిన నలుగురు వ్యక్తుల పేర్లు నమోదు
- గత ఏడాది నవంబరులో వేరే వ్యక్తులకు విక్రయం
- కె.కోటపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- కబ్జా చేసిన స్థలం విలువ రూ.5-6 కోట్లు ఉంటుందని అంచనా

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ భూములు ఖాళీగా కనిపిస్తే చాలు.. అధికార వైసీపీ నాయకులు అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు. ప్రభుత్వ కొండ పోరంబోకు, బంజరు, గెడ్డలు, వాగుల, వంకలు.. చివరకు గ్రామ అవసరాలకు వినియోగించాల్సిన గ్రామ కంఠ భూములను కూడా వదలడం లేదు. దర్జాగా ఆక్రమించి, రెవెన్యూ రికార్డుల్లో జిరాయితీగా నమోదు చేయిస్తున్నారు. అంతేకాక ఆయా భూములను విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. వైసీపీ నేతల భూ కబ్జాలపై స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా కె.కోటపాడు మండలం కె.సంతపాలెంలో సుమారు ఐదారు కోట్ల రూపాయల విలువ చేసే 60 సెంట్ల గ్రామకంఠం స్థలానికి సంబంధించి రెవెన్యూ రికార్డులను తారుమారుచేసి ప్రైవేటు వ్యక్తుల పేర్లను నమోదు చేయించారు. ఆ తరువాత వేరే వ్యక్తులకు దర్జాగా విక్రయించి సొమ్ముచేసుకున్నారు.

కె.కోటపాడు మండలం కె.సంతపాలెం పంచాయతీ కె.కె.అగ్రహారం గ్రామంలో రెవెన్యూ భూరికార్డుల ఖాతా నంబరు 20301, సర్వే నంబరు-7లో ఐదు ఎకరాల 47 సెంట్ల గ్రామ కంఠం వుంది. ఇందులో 60 సెంట్ల స్థలం గ్రామ నడిబొడ్డున ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఇక్కడ మార్కెట్ రేటు ప్రకారం సెంటు భూమి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు పలుకుతున్నది. దీంతో ఈ భూమిపై స్థానిక వైసీపీ నాయకుల కన్ను పడింది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి రికార్డులు మార్చేశారు. విశాఖపట్నం అక్కయ్యపాలేనికి చెందిన కవికొండల సత్యనారాయణమూర్తి, కవికొండల శ్రీకృష్ణ, కవికొండల వీరరామస్వామి, కవికొండల విద్యాసాగర్ పేర్లతో నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించారు. ఒక్కొక్కరి పేరున 15 సెంట్లు వున్నట్టు నమోదు చేశారు. వైసీపీ నేతల అక్రమాలకు స్థానిక వీఆర్‌ఓ, సర్వేయర్ తమవంతు సహకారం అందించినట్టు తెలిసింది. తరువాత ఈ స్థలాన్ని విశాఖపట్నంలో వేర్వేరు ప్రాంతాల్లో నివాసముంటున్న కొరుపోలు గోవింద (తండ్రి తమ్మునాయుడు), చల్లా రామతేజ (తండ్రి వెంకటరమణ), దుబ్బా కామేశ్వరరావు (తండ్రి రామయ్య), జాగరాపు తారకేశ్వరరావు (తండ్రి సత్యారావు)లకు విక్రయించి 2022 ఆగస్టు 18న కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో (దస్తావేజు నంబర్ 2,650) రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. గ్రామ కంఠం స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యక్తులు దీనిని చదును ... మిగతా 8వ పేజీలో


రెవెన్యూ అడంగల్‌లో గ్రామకంఠంగా నమోదైన దృశ్యం

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, వేదికపై జనసేన నాయకులు

- రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడింది
- ప్రజలు చాలా నష్టపోయారు
- వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి
- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ
- టీడీపీ-జనసేన కూటమి విజయానికి బూత్ కమిటీలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని వెల్లడి

అనకాపల్లి (ఆంధ్రజ్యోతి)/ కొత్తూరు, జనవరి 29:
వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లిలోని ఒక ప్రైవేటు కన్వెన్షన్ హాలులో సోమవారం ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా జనసేన నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసీపీ పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే సమయం ఆసన్నమైందని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు చాలా నష్టపోయారని, అభివృద్ధి విషయంలో మరింత వెనక్కు వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం సాధించేందుకు త్వరలో అన్ని నియోజకవర్గాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అదే విధంగా ఈ ప్రాంతాన్ని దత్తత తీసుకోవాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను ఇప్పటికే కోరినట్టు కొణతాల చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలను పూర్తి చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే నడవాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరగాలని అన్నారు. త్వరలో అనకాపల్లిలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ను ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తామని చెప్పారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏం చేయాలో పవన్‌కల్యాణ్ ప్రకటిస్తారని చెప్పారు. జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తమ్మిరెడ్డి శివశంకర్, బొలిశెట్టి సత్య, నియోజకవర్గ ఇన్‌చార్జిలుఉ గెడ్డం బుజ్జి, పీవీఎస్ఎన్ రాజు, సుందరపు విజయకుమార్, పరుచూరి భాస్కరరావు, రాజాన సూర్యచంద్ర, రామకృష్ణ, పంచకర్ల సందీప్, వంపూరి గంగులయ్య, వీర మహిళలు త్రివేణి, లక్ష్మీచౌదరి, కిరణ్ ప్రసాద్, షాలినీదేవి మాట్లాడారు.

విద్యుత్ చార్జీలు పెంచబోం

- ఈ ఆర్థిక సంవత్సరం భారం మోపబోము


సీఎండీ పృథ్వీతేజ్

- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్
- 2024-25 ఆదాయ అంచనాలు రూ.21,162 కోట్లు
- ప్రతిపాదిత ధరల రాబడి రూ.100.44 కోట్లు
- రైల్వే ట్రాక్షన్ చార్జీలు యూనిట్‌కు రూపాయి పెంపునకు ప్రతిపాదన

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ఈ (2024-25) ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి భారం మోపడం లేదని, చార్జీలు పెంచడం లేదని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ సోమవారం నిర్వహించిన టారిఫ్ ప్రతిపాదనల స్వీకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని డిస్కమ్ ప్రగతిని, ప్రతిపాదనలు వివరించారు.

కేవలం రైల్వే ట్రాక్షన్ ... మిగతా 8వ పేజీలో

పేదల భూములకు టెండర్!

జగనన్న స్మార్ట్ సిటీ పేరుతో అధికారులు స్వాధీనం

- సాగుదారులకు చెప్పకుండా భూమి చదును
- వైసీపీ నేత ఆక్రమణలో ఉన్న భూమికి మినహాయింపు!
- ఆందోళనకు దిగిన రైతులు


స్మార్ట్‌సిటీ కోసం చదును చేస్తున్న భూములు

అచ్యుతాపురం, జనవరి 29:
ప్రభుత్వం గతంలో పేదలకు ఇచ్చిన పట్టా భూములను సాగుదారులకు తెలియకుండా రెవెన్యూ అధికారులు జగనన్న స్మార్ట్ సిటీకి కేటాయించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై నిరసన తెలుపుతూ సోమవారం ఆందోళనకు దిగారు. ఇదే సమయంలో అధికార పార్టీ నాయకుడి ఆక్రమణలో ఉన్న ఐదు ఎకరాలను ఎందుకు మినహాయించారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇందుకు సంబంధించి రైతులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

అచ్యుతాపురం- గాజువాక ప్రధాన రహదారిని ఆనుకొని గురుకుల పాఠశాల పక్కన చోడపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 32, 33, 56, భోగాపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 21లో దాదాపు 66 ఎకరాల 36 సెంట్లు ప్రభుత్వ భూమి వుంది. 1972లో రామన్నపాలెం, భోగాపురం గ్రామాలకు చెందిన సుమారు 110 మంది నిరుపేద రైతులకు ఈ భూమిని ప్రభుత్వం కేటాయించింది. రెవన్యూ అధికారులు పట్టాలు కూడా పంపిణీ చేశారు. రైతులు అప్పటి నుంచి భూములను సాగుచేసుకుంటూ జీవిస్తున్నారు. అనంతర కాలంలో ఈ ప్రాంతంలో ప్రత్యేక ఆర్థిక మండలి రావడంతో భూముల విలువ గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో మండలానికి జగనన్న స్మార్ట్ సిటీ మంజూరైంది. ఇందుకు అవసరమైన భూములను అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, జగనన్న స్మార్ట్ సిటీ ఏర్పాటుకు చోడపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 32, 33, 56, భోగాపురం రెవెన్యూ పరిధిలోనిఇ సర్వే నంబరు 21లో వున్న 66.36 ఎకరాల డి.పట్టా భూములను సేకరించాలని సూచించారు. దీంతో రెవెన్యూ అధికారులు, సంబంధిత రైతులకు మాటమాత్రంగా అయినా చెప్పకుండా గత శుక్రవారం రాత్రి యంత్రాలతో భూమిని చదును పనులు మొదలుపెట్టారు. రైతులు ఉదయం శనివారం భూమివద్దకు వచ్చి పనులు అడ్డుకున్నారు. సోమవారం అధికారులు వచ్చి సమస్యను పరిష్కరిస్తారని చెప్పడంతో రైతులు వెనక్కి ... మిగతా 8వ పేజీలో


చదును చేస్తున్న భూముల వద్ద టెంట్ వేసి ఆందోళన చేస్తున్న రైతులు

విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని


విశాల్ గున్ని


హరికృష్ణ

- హరికృష్ణకు ఐజీ (పర్సనల్)గా పోస్టింగ్
- నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకు స్థానచలనం
- విజయనగరం 5వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ
- పాడేరు ఏఎస్పీ ధీరజ్ రంపచోడవరానికి.. అక్కడ వున్న జగదీశ్ పాడేరుకు..

విశాఖపట్నం/ అనకాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల పదోన్నతి పొందిన విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణను ఐజీ పర్సనల్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఆయన స్థానంలో విజయవాడ డీసీపీగా పనిచేస్తున్న విశాల్ గున్నీని నియమించారు.

నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, విజయనగరం 5వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. పాడేరు ఏఎస్పీ కె.ధీరజ్‌ను రంపచోడవరం ఏఎస్పీగా బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న ఎ.జగదీశ్‌ను పాడేరు ఏఎస్పీగా నియమించారు.

కాగా గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న విశాఖ నగర జాయింట్ పోలీస్ కమిషనర్ పోస్టులో కె.ఫకీరప్పను నియమించారు.. డీసీపీ-1గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును జగ్గయ్యపేట డీసీపీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న మణికంఠ చందోల్‌ను నియమించారు. అలాగే డీసీపీ-2గా పనిచేస్తున్న కె.ఆనందరెడ్డిని విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీపీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో విజయవాడ డీసీపీగా పనిచేస్తున్న మోక సత్యనారాయణను నియమించారు.జాయింట్ కమిషనర్‌గా రానున్న ఫకీరప్ప గతంలో నగర లా అండ్ ఆర్డర్ డీసీపీగా పనిచేశారు. ఎన్నికల ముందు ఫకీరప్పను నగరానికి జాయింట్ పోలీస్ కమిషనర్‌గా నియమించడంపై పోలీసు వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది.


అధిరాజ్‌సింగ్ రాణా, నర్సీపట్నం ఏఎస్పీ

క్రైం... crime news

ద్విచక్ర వాహనం చోరీ

పాయకరావుపేట, జనవరి 29 : పట్టణంలోని కురుమళ్ల లేఅవుట్‌లో ఆదివారం అర్ధరాత్రి ముసుగులు వేసుకుని వచ్చిన నలుగురు వ్యక్తులు ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనాన్ని దొంగిలించుకుపోయారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలో టీవీ మెకానిక్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తి ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు ఉంచారు. అర్ధరాత్రి దాటిన తరువాత నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగు వేసుకువచ్చి ద్విచక్ర వాహనం హ్యాండిల్ లాక్‌ని తొలగించి దర్జాగా వేసుకుని వెళ్లిపోయారు. దొంగలు ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు బాధితుడు తెలిపాడు.

గుర్తుతెలియని మహిళ మృతి

ముంచంగిపుట్టు, జనవరి 29: మండలంలోని కిలగాడ పంచాయతీ కేంద్రంలో గల బస్ షెల్టర్ వద్ద సోమవారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆ పంచాయతీ సర్పంచ్ కె.శివశంకర్ ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ(58) కిలగాడ ప్రాంతంలో గత వారం రోజులుగా సంచరిస్తున్నది. గ్రామ సమీపంలో గల బస్ షెల్టర్ వద్ద ఉంటూ కాలం గడుపుతున్నది. స్థానికులు ఆమెకు రోజూ ఆహారాన్ని ఇచ్చేవారు. అయితే గత మూడు రోజులుగా చలి తీవ్రత ఎక్కువైంది. ఆమె చలికి తట్టుకోలేక మృతి చెంది ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుర్తు తెలియని మహిళ మృతి చెందిందన్న విషయం తెలుసుకున్న సర్పంచ్‌తో పాటు ఆ గ్రామస్థులు దగ్గరుండి మృతదేహానికి అంత్యక్రియలు చేయించారు.

11 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కోటవురట్ల, జనవరి 29: మండలంలో రామన్నపాలెంలో ఒక ఇంటిలో సోదాలు నిర్వహించి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రమణయ్య చెప్పారు. రామన్నపాలెం గ్రామానికి చెందిన పొలిపర్తి అప్పలనాయుడు తన ఇంటివద్ద మద్యం విక్రయిస్తున్నట్టు అదే గ్రామానికి చెందిన ఒకవ్యక్తి సమాచారం ఇచ్చారని ఆయన తెలిపారు. తనతోపాటు ఇద్దరు పోలీసులు వెళ్లి అప్పలనాయుడు ఇంటిలో తనిఖీలు చేయగా 11 మద్యం సీసాలు లభించాయన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కోటవురట్ల, జనవరి 29: మండలంలోని రాజుపేట వద్ద సర్పా నదిలో నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ రమణయ్య చెప్పారు. కోటవురట్ల, మాకవరపాలెం మండలాల సరిహద్దులో రాజుపేట వద్ద సర్పా నదిలో ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తున్నట్టు స్థానికులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి ఇసుక రవాణా చేస్తున్న మాకవరపాలెం మండలం కొండలఅగ్రహారం గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానికి రూ.10 వేలు అపరాధ రుసుము విధిస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు

» విశాఖ కానిస్టేబుల్‌పై స్పందనలో బాధితుల ఫిర్యాదు


చోడవరం, జనవరి 29: పోలీస్ శాఖలో, నేవల్ డాక్‌యార్డులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విశాఖ సిటీ కంచరపాలెం స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కసిరెడ్డి రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబు తమ నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారని పలువురు నిరుద్యోగులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన కానిస్టేబుల్ కసిరెడ్డి రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబు కచ్చితంగా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పడంతో తామంతా రూ. 3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వారికి ముట్టజెప్పామని, తీసుకున్న డబ్బులకు సంబంధించి కొందరికి బ్యాంకు చెక్కులతో పాటు, నోట్లు కూడా ఇచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఎప్పుడు అడిగినా వచ్చేస్తున్నాయంటూ తప్పించుకుంటూ తిరుగుతున్నారని, డబ్బులైనా తిరిగి ఇచ్చేయాలని అడిగితే వారు తమను బెదిరిస్తున్నారని వాపోయారు.

మండల సమావేశంలో అన్యుల హవా!

» మహిళా సభ్యులకు బదులు పురుషులు హాజరు

» పలు అంశాలపై అధికారులకు ప్రశ్నలు

» చోద్యం చూస్తున్న మండల పరిషత్ అధికారులు


ప్రశ్నిస్తున్న బంగారమ్మపాలెం ఎంపీటీసీ సభ్యురాలు రాపేటి అరుణ భర్త రాము

సబ్బవరం, జనవరి 29 : స్థానిక సంస్థల్లో మహిళలకు కల్పించిన రిజర్వేషన్లను అధికార పార్టీ నేతలు అపహాస్యం చేస్తున్నారు. మండల పరిషత్ సమావేశానికి మహిళా ప్రజాప్రతినిధులకు బదులు వారి కుటుంబాలకు చెందిన పురుషులు దర్జాగా హాజరవుతున్నారు. పైగా పలు అంశాలను సమావేశంలో ప్రస్తావిస్తూ, అధికారులను నిలదీస్తున్నారు. సభ్యులు కానివారిని సమావేశాలకు హాజరుకాకుండా చూడాల్సిన ఎంపీడీవోలు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో తరచూ ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ జడ్పీ సీఈవో సైతం పట్టించుకోవడంలేదు. తాజాగా సోమవారం జరిగిన సబ్బవరం మండల సర్వసభ్య సమావేశంలో ఈ తరహా సంఘటనే చోటుచేసుకుంది. బంగారమ్మపాలెం ఎంపీటీసీ నుంచి రాపేటి అరుణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మండల పరిషత్ సమావేశానికి ఆమెతోపాటు భర్త రాము కూడా వచ్చారు. అంతేకాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డబ్బులు తీసుకొని ఇష్టానుసారం రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకుంటే అన్నీ బాగున్నా రిజిస్ట్రేషన్‌ను పెండింగ్‌లో పెడుతున్నారని సమావేశానికి హాజరైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక టీడీపీకి చెందిన వంగలి సర్పంచ్ ఆకుల శ్రీహేమ భర్త గణేశ్ కూడా సమావేశానికి హాజరై సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో రమేశ్‌నాయుడును వివరణ కోరగా, అనుకోకుండా వారిద్దరు (రాపేటి రాము, ఆకుల గణేశ్) సభలోకి వచ్చారని, తనకు బదిలీ అయి, రిలీవ్ అయ్యే హడావిడిలో ఉండగా ఈ సంఘటన చోటు చేసుకుందన్నారు.

'అసంపూర్తిగా ఉన్న సచివాలయాన్ని ప్రారంభిస్తే అడ్డుకుంటాం'

గొలుగొండ, జనవరి 29: మండలంలోని పాతమల్లంపేటలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తే అడ్డుకుంటామని గ్రామ సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి హెచ్చరించారు. మండలంలో ఈ నెల 30వ తేదీన పలు గ్రామ సచివాలయాలను స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ ప్రారంభించేందుకు ఆయా గ్రామాల్లో సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా పాతమల్లంపేట గ్రామ సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణాన్ని సంబంధిత కాంట్రాక్టరు కొంత మేర పూర్తి చేశారు. దీనిపై సోమవారం పాతమల్లంపేట సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయ భవనానికి ఇప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయలేదన్నారు. మరుగుదొడ్లు కూడా అసంపూర్తిగా ఉన్నాయన్నారు. పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టకుండా భవనాన్ని ప్రారంభించడమేమిటని సంబంధిత అధికారులను, పాలకులను ప్రశ్నించారు. ఈ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించాలనుకుంటే హెచ్చరించారు. హెల్త్ సెంటర్, ఆర్‌బీకే భవనాలు అసంపూర్తి పనులతో రెండున్నరేళ్లుగా దర్శనమిస్తున్నట్టు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

ఫార్మా వ్యర్థాల ల్యాండ్ ఫిల్‌కు అనుమతులు ఇవ్వొద్దు

» రాంకీపై కేసు నడుస్తుండగా ప్రజాభిప్రాయ సేకరణ చట్టవిరుద్ధం

» సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

» స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాంకీ కాలుష్యంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)లో కేసు నడుస్తుండగా తాడిలో ల్యాండ్ ఫిల్ ఏర్పాటుకు ఈ నెల 30న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం చట్ట విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రవిపట్టన్‌శెట్టికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం లోకనాథం మీడియాతో మాట్లాడుతూ, పరవాడ మండలం తాడి గ్రామం సర్వే నంబరు 116లో ఫార్మాసిటీ డెవలపర్ అయిన ర్యాంకీ మరో 50 ఎకరాల్లో ప్రమాదకర వ్యర్థాల శుద్ధి నిల్వ(ల్యాండ్ ఫిల్) ఏర్పాటుకు సిద్ధపడుతోందన్నారు. దీనికోసం మంగళవారం పరవాడలో కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయం సేకరణ నిర్వహిస్తున్నదన్నారు. కాలుష్య నియంత్రణ పద్ధతులు, నియమ నిబంధనలు, చట్టపరమైన సూత్రాలు పాటించని ర్యాంకీకి ల్యాండ్ ఫిల్ ఏర్పాటుకు అనుమతులివ్వడం మంచిదికాదన్నారు. ఇప్పటికే తాడి, తానాం, బీసీ కాలనీ, పరవాడ, లంకెలపాలెం, వల్లూరు, వెంకటాపురం, టీసిరసపల్లి, కొత్తూరు, అనకాపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రమైన కాలుష్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. తాడి గ్రామ ప్రజలు ఫార్మా కంపెనీల కాలుష్యం బారినపడి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారన్నారు. పర్యావరణ నిబంధనలు పాటించని ర్యాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోగా, మరో ల్యాండ్ ఫిల్‌కి అనుమతి ఇచ్చి మరింత తప్పు చేయడానికి అధికారులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాంకీకి కేటాయించిన 50 ఎకరాల భూమిని వెనక్కి తీసుకోవాలని, మంగళవారం చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

పరవాడ: ఫార్మాసిటీలో ఘన వ్యర్థాల నిల్వ కోసం అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు కు మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వి.కనకారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయం పక్కన వున్న ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాంకీ ఆధ్వర్యంలో తాడి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 116లో వున్న 50 ఎకరాల విస్తీర్ణంలో ల్యాండ్‌ఫిల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

సంగీతం ఉన్నంత వరకు 'వేటూరి'ని మరువలేం

» సినీ రచయిత, దర్శకుడు జేకే భారవి

» శ్రీప్రకాష్ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేటూరి కవితా పురస్కారం



పుస్తకాలతో జేకే భారవిని సత్కరించిన దృశ్యం

తుని రూరల్, జనవరి 29: 'కలలు చెదిరినా పాటే, కలత చెందినా పాటే'.. ఎలాంటి భావాన్నైనా పలికించగలిగే శక్తి వేటూరికే సాధ్యమని, క్లిష్టమైన, సరళమైన పదాలతో గారడీ చేస్తూ ఆడుకోవడం 'వేటూరి' మాత్రమే చేయగలరని, సంగీతం, సాహిత్యం ఉన్నంతవరకు వేటూరిని మరిచిపోలేమని ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు, పాటల రచయిత జేకే భారవి అన్నారు. తునిలోని చిట్టూరి మెట్రోలో వేటూరి సాహితి పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వేటూరి జయంతి వేడుకల్లో ఈ ఏడాది త్రయోదశ(13వ) వేటూరి కవితా పురస్కారాన్ని జేకే భారవి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటూరి వారి పురస్కారానికి తనను ఎంపిక చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నేటి యువతకు గాయకులుగా, గేయ రచయితలుగా చాలా అవకాశాలున్నాయని, సరస్వతిని కొలిస్తే వచ్చే జ్ఞానం మనల్ని కాపాడడమే కాకుండా మన భూగోళాన్ని కాపాడుకోవడమే మన ప్రథమ కర్తవ్యంగా తెలియజేస్తుందన్నారు. కవులకు ధనం ముఖ్యం కాదని, వారి వాక్చాతుర్యం, రచనాశైలి వారికి నిజమైన సంపద అని అన్నారు. అన్నమయ్య, రామదాసు, మంజునాథ సినిమాలకంటే ఆదిశంకరాచార్య సినిమాకు యూట్యూబ్ వీక్షకులు ఎక్కువ ఉండడం తనకు వచ్చిన విజయంగా భావిస్తున్నానన్నారు. ఎక్కడో పుట్టిన మహానుభావుడిని దేశం అంతటా జయంతి వేడుకలు చేస్తున్నామంటే ఆయన గొప్పదనాన్ని నేటి యువత తెలుసుకోవాలని అన్నారు. వేటూరి వంటి మహానుభావుని జయంతి వేడుకలు ఇంత ఘనంగా జరగడం తెలుగు సాహిత్యానికి ఇస్తున్న గౌరవమని, తెలుగు సాహిత్యానికి, సంగీతానికి, తెలుగుపాటకు వన్నె తెచ్చిన వ్యక్తిగా వేటూరి చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్, రసమాధురి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరాల సీతారామ ప్రభు మాట్లాడుతూ వేటూరి మన మధ్య లేకపోయినా పాటల రూపంలో బతికే ఉన్నారని, కవులు ఉన్నంతకాలం తెలుగు భాష వైభవం తగ్గదన్నారు. వేటూరి జయంతి సందర్భంగా సినీరంగ సాహిత్య ప్రముఖులకు ఏటా పురస్కారాలు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేటూరి సాహితి పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మ, ప్రధాన కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్‌ల కృషి అభినందనీయమన్నారు. అనంతరం సన్మాన గ్రహీత జేకే భారవిని తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు పుస్తకాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేటూరి సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు చక్కా సూర్యనారాయణ, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి, వేటూరి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే.శర్మతోపాటు తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై సత్వరమే స్పందించండి

» అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం


అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 29: స్పందనలో ప్రజలు అందజేసే అర్జీలపై సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జేసీ, డీఆర్‌వోలతో కలిసి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి పలు సమస్యలపై 494 అర్జీలు అందజేశారు. అనంతరం వీటిని సంబంధిత శాఖల అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందనలో వచ్చే అర్జీలు ప్రధానంగా భూసమస్యలు, రేషన్‌కార్డులపై అధికంగా వుంటున్నాయని, సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి దృష్టి సారించాలని ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లిరూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిష్కారం కోసం అర్జీలను సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వాటిపై తీసుకున్న చర్యల గురించి నిర్ణీత సమయంలో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 46 మంది అర్జీలు అందజేయగా వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటివి అధికంగా వున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉప్పరాపల్లి హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎంకు ప్రధాని అభినందనలు


ఢిల్లీలో నిర్వహించిన పరీక్షా పే చర్చా కార్యక్రమంలో ఉప్పరాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం

ఎస్.రాయవరం, జనవరి 29: ఢిల్లీలోని ప్రగతి మైదాన్ భారత్ మండపంలో సోమవారం నిర్వహించిన 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో ఎస్.రాయవరం మండలం ఉప్పరాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కొండకంచి సంపత్‌రావు సలహాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ మెచ్చుకుని అభినందించారు. ఈ సందర్భంగా సంపత్‌రావు ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, విద్యార్థులకు సంగీతాన్ని వినిపించడం ద్వారా పరీక్షల్లో ఒత్తిడిని తగ్గించవచ్చన్న తన సమాధానం ఉత్తమ మైనదిగా గుర్తించి రాష్ట్రం తరఫున పరీక్షా పే చర్చ కార్యక్రమానికి తనను ఎంపిక చేశారన్నారు. అయితే ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో తాను పాల్గొనాల్సి వున్నప్పటికీ సమయాభావం పీఎం కార్యాలయం వారు ఆదివారం విశాఖ నుంచి ప్రత్యేక బృందాన్ని ఇక్కడకు పంపి, తన ప్రసంగాన్ని వీడియో రికార్డింగ్ చేసుకున్నారని చెప్పారు. దీనిని ఢిల్లీలో నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో ప్రదర్శించగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తిలకించి తనను మెచ్చుకున్నారని సంపత్‌రావు చెప్పారు. ఈ అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

'తుది ఓటర్ల జాబితాలో అవకతవకలు'


ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై డీఆర్‌వోతో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 29 : అనకాపల్లి జిల్లాలో తుది ఓటర్ల జాబితాలో అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం రాత్రి డీఆర్‌వో బి. దయానిధిని కలిసి కోరారు. తుది ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పుల గురించి డీఆర్వోకు ఆయన వివరించారు. జాబితాల్లో ఉన్న లోపాలకు సంబంధించి తగిన ఆధారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, సిరసపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 14న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చే నెల 14వ తేదీన జరుగుతుందని సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరుకావాలని కోరారు. జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

9న డీ-వార్మింగ్ డే

» 1-19 ఏళ్ల వారందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 29: ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వారికి నులిపురుగుల నుంచి రక్షణ కల్పించేందుకు ఫిబ్రవరి 9వ తేదీ డీ-వార్మింగ్ డే సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు వేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన జేసీ ఎం.జాహ్నవి, డీఆర్‌వో బి.దయానిధిలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ మాత్రలను అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా ఇస్తారని చెప్పారు. ఆ రోజు అల్బెండజోల్ మాత్రలు వేసుకోని పిల్లలకు 16వ తేదీన మాత్రలు వేయాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్ మాట్లాడుతూ, నులిపురుగుల సమస్య వున్న పిల్లలు మాత్రలు వేసుకున్న తర్వాత వికారం, కొద్దిగా కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయని, అయినా ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. మరింత సమాచారం కోసం ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలను సంప్రదించాలన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు బదిలీ?

» అనకాపల్లి కలెక్టర్‌గా పోస్టింగ్ ఇస్తారని ఊహాగానాలు

» ఈ క్రమంలోనే అదనపు కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి విశ్వనాథన్ నియామకం

» జీవీఎంసీలో సర్వత్రా చర్చ


జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మకు త్వరలో బదిలీ అయ్యే అవకాశం ఉందని అధికార వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. 2015 బ్యాచ్‌కు చెందిన సాయికాంత్‌వర్మ పనితీరుపై వైసీపీ పెద్దల్లో సానుకూలభావం ఉంది. దీంతో ఆయనకు అనకాపల్లి జిల్లాకు కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉందని అధికారులతోపాటు వైసీపీ ముఖ్య నేతలు చెబుతున్నారు. ఆయన్ను కలెక్టర్‌గా పంపించే ఉద్దేశం ఉండడం వల్లే 2017 బ్యాచ్‌కు చెందిన జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా నియమించారని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ముగ్గురు అదనపు కమిషనర్లు ఉండగా, నాలుగో అదనపు కమిషనర్ అవసరం లేదని, ఇప్పుడున్న కమిషనర్‌ను బదిలీ చేస్తే విశ్వనాథన్‌ను ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉంచి పాలన సాగించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశంగా చెబుతున్నారు. కాగా జాయింట్ కలెక్టర్‌గా విశ్వనాథన్ ముక్కుసూటిగా వ్యవహరించడంతోపాటు వైసీపీ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని భూములకు సంబంధించిన ఫైళ్లను ఆయన వైసీపీ నేతల సిఫార్సులను పరిగణనలోకి తీసుకోకుండానే వెనక్కి పంపించేశారని, అందువల్లే జాయింట్ కలెక్టర్ పోస్టు నుంచి బదిలీ చేశారని పేర్కొంటున్నారు. ముక్కుసూటి అధికారి అయిన విశ్వనాథన్ జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా ఉంటే అక్కడ కీలకమైన విభాగాలను ఆయనకు అప్పగించే అవకాశం ఉందని, ఫైళ్లు అన్నీ పక్కాగా ఉంటేనే ఆయన ముందుకు పంపిస్తారని, లేనిపక్షంలో ఎవరు చెప్పినా రిమార్కులతో వెనక్కి పంపేస్తారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

రికార్డుస్థాయిలో బెల్లం లావాదేవీలు

» ఎన్టీఆర్ మార్కెట్ యార్డుకు 16,030 బెల్లం దిమ్మలు రాక

అనకాపల్లి టౌన్, జనవరి 29: స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో సోమవారం రికార్డుస్థాయిలో బెల్లం లావాదేవీలు జరిగాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి రైతులు వచ్చి 16,030 బెల్లం దిమ్మలు విక్రయించారు. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికం. ఈ నెల ఎనిమిదో తేదీన అత్యధికంగా 14,939 బెల్లం దిమ్మల లావాదేవీలు జరిగాయి. సోమవారం మరో వెయ్యికిపైగా బెల్లం దిమ్మలు వచ్చాయి. అయితే ఎనిమిదో తేదీనతో పోల్చితే ధరలు స్వల్పంగా తగ్గాయి. ఎనిమిదో తేదీన ఒకటో రకం వంద కిలోలు రూ.4,230లు, రెండో రకం రూ.3,850లు, మూడో రకం రూ.3,700లు పలకగా, సోమవారం ఒకటో రకం వంద కిలోలు రూ.4,100, రెండో రకం రూ.3,760, మూడో రకం రూ.3,550 పలికాయి. ఒకటో రకం రూ.130, రెండో రకం రూ.90, మూడో రకం రూ.150 చొప్పున ధరలు తగ్గాయి. ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ తగ్గడంతో యార్డుకు వచ్చిన బెల్లంలో కొంత సరకును ఎగుమతి వర్తకులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయగా, మరికొంత బెల్లాన్ని ఒడిశాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు

» సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలి

» ప్రత్యేక బస్సులు నడపాలి

» కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశం

అనకాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో ఇంటర్మీడియట్ పరీక్షలు, అంతకు ముందు ఫిబ్రవరిలో ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా జరిగేలా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమం తరువాత ఆయన అధికారులతో మాట్లాడుతూ విద్య, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలని పీటీడీ రీజనల్ మేనేజరును ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటిని అందుబాటులో వుంచాలని జీవీఎంసీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఆయా కళాశాలల్లో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారులకు స్పష్టం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షల తనిఖీ స్క్వాడ్‌తోపాటు రెవెన్యూ అధికారి, ఎస్‌ఐ, విద్యా శాఖ అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. ఆర్‌ఐఓ బి.సుజాత మాట్లాడుతూ, ఫిబ్రవరి 2వ తేదీన ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 3న ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ పరీక్ష, 22న సమగ్ర శిక్ష ఒకేషనల్ ట్రేడ్ ఎన్ఎస్‌క్యూఎఫ్ లెవెల్-4 థియరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

జగన్‌రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, జగన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వానికి ఇంకా కేవలం 74 రోజులు మాత్రమే మిగిలివుందన్నారు. వైసీపీ అరాచక పాలనకు అంతం చేసేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల తరువాత వైఎస్‌ఆర్ జెండా కనుమరుగు కావడం ఖాయమన్నారు. వైసీపీ అసమర్థ పాలనతో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. ఈ సమావేశానికి టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, జిల్లా కార్యదర్శి మళ్ల గణేష్ పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు అంశాన్ని చేర్చాలి

» పంచకర్లకు ఉద్యోగుల వినతి

కొత్తూరు, జనవరి 29: జనసేన, తెలుగుదేశం పార్టీల మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు అంశాన్ని చేర్చాలని సీపీఎస్ ఉద్యోగులు జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబును కోరారు. సోమవారం వారు పంచకర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాథస్వామి, అదనపు కార్యదర్శి బోయిన చిన్నారావు, అనకాపల్లి రూరల్ మండల అధ్యక్షుడు గౌరీనాయుడు, అనకాపల్లి అర్బన్ గౌరవాధ్యక్షుడు బలిరెడ్డి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులు అర్ధనగ్నంగా నిరసన

అనకాపల్లి టౌన్, జనవరి 29: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ) ఉద్యోగులు సోమవారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. సెర్ప్ ఉద్యోగులు ఈ నెల 27వ తేదీ నుంచి సమ్మె చేస్తూ నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద దీక్షా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం నియమించిన మంత్రుల సబ్ కమిటీ ద్వారా సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంతేకాక ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేసి సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని కోరారు. ఇందుకోసం ఆర్థిక శాఖ ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పరిధిలో శాంక్షన్ పోస్టులుగా గుర్తిస్తూ ఇచ్చిన సర్క్యులర్ మెమోపై తగు జీవో విడుదల చేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్నట ఈపీఎఫ్ సీలింగ్ విధానాన్ని ఎత్తివేసి మూల వేతనంపై నూరు శాతం ఈపీఎఫ్‌ను అమలు చేయాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపజేస్తూ ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పించాలని, కారుణ్యనియామకాలు జరిపి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని, పదవీవిరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అంధకారం

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 29 : వైసీపీ పాలనలో రాష్ట్రం అంధకారంలోకి నెట్టబడిందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్‌లో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న భూకబ్జాలు, కల్తీ మద్యం అమ్మకాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డి అని ఆరోపించారు. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదంశెట్టి నీలబాబు, మళ్ల సురేంద్ర, కొణతాల ఉమ, తలారి లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

'ఎంపీడీవో రమేశ్‌నాయుడు సేవలు ఆదర్శం'



ఎంపీడీవో బి.రమేశ్‌నాయుడును సత్కరిస్తున్న దృశ్యం

సబ్బవరం, జనవరి 29: ఎంపీడీవోగా సుదీర్ఘ సేవలందించిన రమేశ్‌నాయుడు సేవలు ఆదర్శనీయమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. బదిలీపై తూర్పుగోదావరి వెళుతున్న ఎంపీడీవో రమేశ్‌నాయుడును ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. 2018, 2020 సంవత్సరాల్లో సబ్బవరానికి జాతీయ అవార్డు తెచ్చిన ఘనత ఎంపీడీవో రమేశ్‌నాయుడుదన్నారు. కార్యక్రమంలో ఏవో షేక్ బాబూరావు, ఈవోపీఆర్‌డీ మహేశ్, వైస్‌ఎంపీపీ రుగ్సీలక్ష్మీరాజీ, సర్పంచులు సర్పంచ్ దిడ్డంప్రసాద్, నారాయణమూర్తి, బోకం రామునాయుడు, రాపేటి రాము, సురేశ్‌రాజ్, వద్దాది అప్పలరాజు, సింగంపల్లి శ్రీను,అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

తుమ్మపాల,జనవరి 29: సిద్ధార్ధ సోషల్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఉజ్జి సత్యనారాయణ, అధ్యక్షుడిగా బల్లా నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా పట్నాల కృష్ణమోహన్, కార్యదర్శిగా వినకోట నీలేష్‌గుప్తా, సహాయ కార్యదర్శులుగా రొబ్బి మల్లేశ్వరరావు, బల్లా శ్రీనివాసరావు, సభ్యులు ఎన్నికయ్యారు.

నేడు ప్రభుత్వ హైస్కూల్‌లో మెగా రక్తదాన శిబిరం

ఎలమంచిలి, జనవరి 29: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ విద్యాలయానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించనున్నట్టు పూర్వ విద్యార్థులు తెలిపారు.

నాడు-నేడు మెటీరియల్‌పై విచారణ



రేవుపోలవరంలో ఐరన్ రాడ్‌లను లెక్కిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, జనవరి 29: మండలంలోని రేవుపోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు మెటీరియల్ పక్కదారి పట్టిందంటూ స్థానికులు జిల్లా అధికారులకు చేసిన ఫిర్యాదుపై సమగ్రశిక్ష అభియాన్ ఇన్‌చార్జి ఈఈ రామ్‌ప్రసాద్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు సోమవారం విచారణ జరిపారు. భవన నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ సక్రమంగా ఉన్నదీ లేనిదీ చూశారని ఎంఈవో ఏఎస్ఎన్ఏఎన్ మూర్తి తెలిపారు. ఇందులో భాగంగా అక్కడున్న ఐరన్ రాడ్‌లను లెక్కపెట్టగా తక్కువగా ఉన్నట్టు గుర్తించారన్నారు. అయితే ఐరన్ తూకం వేసి చూడాలని, లెక్క ప్రకారం లేకుంటే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని విచారణకు వచ్చిన అధికారులు తెలిపినట్టు ఎంఈవో మూర్తి చెప్పారు.

ప్రాసెసింగ్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు

» అనకాపల్లి ఎంపీ సత్యవతి

అనకాపల్లి అగ్రికల్చర్, జనవరి 29: వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని ఎంపీ డాక్టర్ బీశెట్టి సత్యవతి అన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో నిర్మిస్తున్న ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన వ్యవసాయ పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థుల సమావేశంలో ఆమె ప్రసంగించారు. తాము పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెసింగ్ ఉత్పత్తులను విక్రయించేందుకు ఆర్ఏఆర్ఎస్‌లో సేల్స్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక బస్సు సదుపాయం కల్పించాలని విద్యార్థులు ఎంపీని కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు మాట్లాడుతూ ఆర్ఏఆర్ఎస్‌లో నిర్మిస్తున్న ఇంక్యుబేషన్ కేంద్రంలో బెల్లం, చిరుధాన్యం, ఉత్పత్తుల ప్రాసెసింగ్ ఫిబ్రవరి నుంచి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి, డాక్టర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

పంపా నదిపై బ్రిడ్జి నిర్మించాలి

కుమారపురం, రత్నయ్యమ్మపేట రైతులు, మత్స్యకారులు వేడుకోలు

పాయకరావుపేట రూరల్, జనవరి 29: మండలంలోని కుమారపురం శివారు రత్నయ్యమ్మపేట సమీపంలో పంపానదిపై జెట్టీ కూలిపోవడంతో రైతులు, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంపానదిపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నా నాయకులు గాని, అధికారులు గాని పట్టించుకోలేదని రత్నయ్యమ్మపేట, కుమారపురం గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల వేళ హామీలు ఇస్తున్నారని, తర్వాత అసలు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కుమారపురం, రత్నయ్యమ్మపేట మత్స్యకారులు వేటకు వెళ్లాలన్నా.. రైతుల భూముల్లోకి వెళ్లాలన్నా పంపానది



రత్నయ్యమ్మపేట సమీపంలో పంపానదిపై కూలిపోయిన జెట్టీ

దాటాలి. గతంలో ఎస్‌టీఎల్ హేచరీ వారు నిర్మించిన జెట్టీ మీదుగా గ్రామస్థులు రాకపోకలు సాగించేవారు. అయితే కొన్ని సంవత్సరాల క్రితం ఆ జెట్టీ కూలిపోవడంతో మత్స్యకారులు, రైతులు పంపా నదిలో దిగి వెళ్లవలసి వస్తుందని వాపోతున్నారు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు వేటకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నామని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రాకపోకలు సాగించే విధంగా కాజ్‌వే నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి కాజ్‌వేగాని, వంతెన గాని నిర్మించాలని కోరుతున్నారు.

ఉమ్మడి అభ్యర్థి విజయానికి అంతా కష్టపడాలి : ప్రగడ

అచ్యుతాపురం, జనవరి 29: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి విజయానికి అంతా కష్టపడాలని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఏజెంట్లకు జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ టీడీపీ శ్రేణులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వైసీపీ ప్రజాకంటక పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కష్టపడిన వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జనపరెడ్డి నరసింగరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, రాష్ట్రకార్యదర్శి రాజాన రమేష్ కుమార్, పతివాడ చిన్నం నాయుడు, మేరుగు బాపునాయుడు పాల్గొన్నారు.

మునగపాకలో.. గడప గడపకు వెళ్లి సైకో అవినీతి, అక్రమ పాలనను ప్రజలకు చెప్పాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. సోమవా



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

రం ఇక్కడ జరిగిన ఇంటిగ్రేటెడ్ శిక్షణ సమావేశంలో ఆయన బూత్, యూనిట్ ఇన్‌చార్జిలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో అని వర్గాలకు తీరని అన్యాయం జరిగిందని, గడప గడపకు వెళ్లి వివరించాలన్నారు. ముఖ్యంగా దళితులను, బీసీలను వంచించారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్, తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, పార్టీ నాయకులు బీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, పెంటకోట విజయ్, మొల్లేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. ఓటు నమోదు ప్రక్రియ నుంచి ఓటు వెరిఫికేషన్ వరకు అన్ని అంశాలన్నింటిపైన అవగాహన చేసుకోవాలని ట్రైనర్లు రాజాన వెంకనాయుడు, సురేష్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులకు, క్లస్టర్ యూనిట్ 1, బూత్ ఇన్‌చార్జులకు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ, ఓటరు వెరిఫికేషన్, టీడీపీ యాప్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, నాయకులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, బొద్దపు రమణ, రాజాన సూర్యనాగేశ్వరరావు, బొద్దపు నాగేశ్వరరావు, నానేపల్లి సుబ్బయ్యనాయుడు పాల్గొన్నారు.

వాడీవేడిగా సబ్బవరం మండల సమావేశం

» సమస్యలపై సభ్యులు ప్రశ్నల వర్షం

» ప్రభుత్వ కార్యక్రమాలకు పిలుపు లేదని ఆవేదన

సబ్బవరం, జనవరి 29: మండలపరిషత్తులో సోమవారం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం అధ్యంతం సభ్యుల ప్రశ్నలతో దద్దరిల్లింది. జలజీవన్ మిషన్ పనులు, ప్రోటోకాల్ అంశం, భూ రీసర్వేలో తేడాలపై సభ్యులు నిలదీశారు. గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులను చేసి రెండేళ్లు అవుతున్నా ప్రారంభించలేదని బాటజంగాలపాలెం సర్పంచ్ వదాల వెంకటరమణ ప్రశ్నించారు. అన్ని ఊళ్లో ఇదే సమస్య ఉందని ఏఈ హిమబిందు సమాధానమిచ్చారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి వచ్చే పైప నుంచి తమ గ్రామంలో ట్యాంక్‌కు కనెక్షన్ ఇవ్వాలని అమృతపురం సర్పంచ్ బైలపూడి గౌరీ, సబ్బవరం-2 ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడుబాబు కోరారు. తవ్వవానిపాలెంలో జల్ జీవన్ పథకంలో ట్యాంక్ నిర్మిస్తారా? లేదా తామే సొంత నిధులతో పనులు చేసుకోవాలా? అని సర్పంచ్ బోకం స్వామినాయుడు ప్రశ్నించారు. ఇప్పట్లో తాము చేయలేమని ఏఈ తేల్చిచెప్పేశారు. వంగలిలో ఏడు వార్డులుండగా కేవలం రెండు వార్డులోనే జలజీవన్ మిషన్ పనులు చేపట్టడితే, మిగతా వార్డులో ప్రజలకు ఏం సమాధానం చెబుతామని సర్పంచ్ అకుల శ్రీహేమ ప్రశ్నించగా.. రెండు వార్డులకే నిధులు ఉన్నాయని ఏఈ సమాధానమిచ్చారు. పైడివాడ అగ్రహారంలో విద్యుత్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

శాఖ అధికారులు ఇష్టానుసారం ట్రాన్స్‌ఫార్మర్లు మార్చేస్తున్నారని, కనీసం తమకు సమాచారం అయినా ఇవ్వడం లేదని సర్పంచ్ వద్దాది అప్పలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు చేపట్టిన రీ సర్వే తప్పుల తడకగా తయారైందని, రైతులు ఇబ్బంది పడుతున్నారని కో-ఆప్షన్ సభ్యుడు గొర్లి సూకరాజు, సర్పంచులు సభ దృష్టికి తేగా, సరిచేస్తామని తహసీల్దార్ సత్యనారాయణ సమాధానం ఇచ్చారు.

గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టినప్పుడు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. అటువంటి సమస్య రాకుండా చూసుకోవాలని ఎంపీపీ సూచించారు. పైడివాడ అగ్రహారంలో జగనన్న ఇళ్ల కాలనీకి ఇళ్ల స్థలాల కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ప్లాట్లు గెడ్డ, శ్మశానం వద్ద ఇచ్చారని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు ఎందుకు స్పందించలేదని (ఆంధ్రజ్యోతిలో కథనం మేరకు) గ్రామ ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సమస్యను పరిష్కరిస్తామని సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఏవో షేక్ బాబూరావు, ఈవోపీఆర్‌డీ మహేష్, వైస్‌ఎంపీపీ దాడి రుగ్సీలక్ష్మీరాజీ, అధికారులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు..

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డబ్బులు తీసుకొని ఇష్టానుసారం రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారని బంగారమ్మపాలెం ఎంపీటీసీ సభ్యురాలు రాపేటి అరుణ భర్త రాము, అరిపాక సర్పంచ్ పాలిశెట్టి పార్వతి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులిస్తే ఎటువంటి పని అయినా పూర్తవుతుందని, ఇవ్వకుంటే పెండింగ్‌లో పెట్టేస్తున్నారని ప్రశ్నించారు. నల్లరేగులపాలెంలో వృద్ధురాలు ఇటీవల మరణించిందని, ఆమెకు ఐదుగురు సంతానం అయితే అందులో కొందరు భూమి రిజిస్ట్రేషన్ పెట్టుకోగా, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్(ఎఫ్ఎంసీ) లేదని నెల రోజులు పెండింగ్ పెట్టి ఆ తరువాత రూ.లక్ష తీసుకొని ఎఫ్ఎంసీ లేకుండానే రిజిస్ట్రేషన్ చేసేశారని రాము ఆరోపించారు. రెవెన్యూ అధికారులు ఇష్టానుసారం భూములు ఆన్‌లైన్ చేసేస్తుంటే రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయని సభ్యులు ఎంపీటీసీ సభ్యురాలు రాపేటి అరుణ, సర్పంచులు పాలిశెట్టి పార్వతి, పిల్లల అప్పలనాయుడు ఆరోపించారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సభ్యులు ఆరోపించిన విధంగా ఏమి జరగలేదన్నారు.

శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం : చిక్కాల

పాయకరావుపేట, జనవరి 29 : క్రీడల ద్వారా శరీర దారుఢ్యంతోపాటు జ్ఞాపకశక్తి పెంపొందించుకోవచ్చని జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. సోమవారం స్థానిక శ్రీ శక్తి భవన్‌లో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడల పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ కార్యక్రమం



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న చిక్కాల రామారావు

దోహదపడుతుందన్నారు. అనంతరం బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీల విజేతలకు చిక్కాల రామారావు, జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు షీల్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.ఎస్.సాంబశివరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు కాదా రామకృష్ణ, వైసీపీ నాయకులు ఇసరపు తాతారావు, కోడా కోటేశ్వరరావు, చోడిపల్లి శ్రీనివాసరావు, కోచ్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'తూర్పుకాపులకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి'

కోటవురట్ల, జనవరి 29: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధికారులు అర్హులైన వారికి కాపు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరుచేయాలని తూర్పు కాపుల సంఘం జిల్లా అధ్యక్షులు కరణం శ్రీహరి డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడ జరిగిన తూర్పు కాపుల మండల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తూర్పుకాపు సర్టిఫికెట్స్ జిల్లాలో ఇతర నియోజకవర్గాల్లో అధికారులు మంజూరు చేస్తున్నారని, కేవలం పాయకరావుపేట నియోజకవర్గంలో ఇవ్వడం లేదన్నారు. అధికారులు తూర్పుకాపు సర్టిఫికెట్లు మంజూరు చేస్తే తమ పిల్లల ఉన్నత విద్యకు ఉపయోగపడతాయన్నారు. అధికారులు స్పందించి నియోజకవర్గంలో అధికారులు తూర్పుకాపు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే తూర్పుకాపులందరూ ఐక్యతగా పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సర్పంచులు వరహాలబాబు(నీలిగుంట),గోపాలకృష్ణ(చౌడువాడ), బాబ్జి(అన్నవరం), సుంకర బాబ్జి(గొట్టివాడ), పందూరు వెంకటేష్ పాల్గొన్నారు.

పేదల భూములకు టెండర్!

... 5వ పేజీ తరువాయి

త్తగారు. అయితే సోమవారం అధికారులు ఎవరూ రైతులతో మాట్లాడలేదు. కానీ భూమి చదును పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు భూముల వద్దకు వచ్చి పనులు అడ్డుకున్నారు. అక్కడే టెంట్ వేసి ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా స్థానిక వైసీపీ నాయకుడు రైతులను బెదిరించి సర్వే నంబరు 56/11లో ఐదు ఎకరాల భూమిని కబ్జా చేశాడు. ఆనంత రం భూమి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించుకున్నాడు. జగనన్న స్మార్ట్ సిటీ కోసం పేద రైతుల భూములను స్వాధీనం చేసుకున్న అధికారులు... సదరు అధికార పార్టీ నేత ఆధీనంలో వున్న భూమిని వదిలేశారు.

గ్రామ కంఠం కబ్జా

... 5వ పేజీ తరువాయి

చేయించారు. రేపోమాపో నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆక్రమణకు గురైన స్థలం విలువ ఐదారు కోట్ల రూపాయలు వుంటుందని స్థానికులు చెబుతున్నారు.

పలుమార్లు ఫిర్యాదు చేసినా...

కె.కోటపాడు మండలం కె.సంతపాలెం పంచాయతీ కె.కె.అగ్రహారంలో గ్రామకంఠం భూమి ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై గత ఏడాది నవంబరు 28వ తేదీన కె.కోటపాడులో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జేసీ జాహ్నవి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో గ్రామానికి చెందిన సీహెచ్ రమణ ఆధ్వర్యంలో పలువురు ఫిర్యాదు చేశారు. తరువాత స్థానిక తహసీల్దార్‌కు కూడా పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఎటువంటి చర్యలు చేపట్టకపోగా.. గ్రామ కంఠం స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాగా గ్రామకంఠం స్థలం ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్‌లపై కె.కోటపాడు తహసీల్దారు రమేశ్‌బాబును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా... ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, గ్రామ కంఠం భూముల వివరాలు పంచాయతీ కార్యదర్శి వద్ద ఉంటాయని, పూర్తి వివరాలు సేకరించి భూ ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్ జరిగివుంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైసీపీ కేడర్‌లో అసంతృప్తి సెగలు

... 5వ పేజీ తరువాయి

వచ్చిన సదరు కార్యకర్త... శంబంగి మంచివాడైనప్పటికీ బేబీ నాయనను తట్టుకోలేరని, ఓడిపోయే చాన్స్ ఉందంటూ విశ్లేషించారు. ఇక్కడ నుంచి జడ్పీ చైర్మన్ చిన్న శ్రీనును బరిలోకి దించితే కొంతవరకూ పోటీ ఇచ్చే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. ఇలా.. మరికొన్ని నియోజకవర్గాల నుంచి వచ్చిన వైసీపీ కార్యకర్తలు కూడా స్థానిక ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో తమకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని వాపోయారు. పార్టీ సమావేశాలకు, సభలకు రావడం తప్ప..కనీసం ఇల్లు కూడా పొందలేక పోయామంటూ నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన ఒక కార్యకర్త వాపోయారు. గ్రామ/మండల స్థాయిల్లో స్థానిక నేతల వ్యవహారశైలి వల్లే పార్టీపై వ్యతిరేకత పెరిగిందన్నారు.

షర్మిల ప్రభావంపై చర్చ

సభా ప్రాంగణంలో వైసీపీ కార్యకర్తలు షర్మిల ప్రభావంపైనా చర్చించుకుంటూ కనిపించారు. ఈసారి షర్మిల వల్ల కొంత ఓట్లు నష్టపోతామని కొందరు విశ్లేషించారు. షర్మిల చేస్తున్న తీవ్ర విమర్శలు పార్టీకి దెబ్బేనని ఆందోళన వ్యక్తంచేశారు. షర్మిలకు జగన్ ఏదో ఒక పదవి ఇచ్చేస్తే సరిపోయేదని, అలా చేయకుండా సమస్యను పెంచుకున్నాడంటూ పలువురు కార్యకర్తలు విశ్లేషించారు.

విద్యుత్ చార్జీలు పెంచబోం

... 5వ పేజీ తరువాయి

చార్జీలను మాత్రం యూనిట్‌కు రూపాయి పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల నుంచి యూనిట్‌కు రూ.5.50 మాత్రమే వసూలు చేస్తున్నామని, సర్వీసు ధర 40 శాతం పెరిగిందని, ఈ నేపథ్యంలో పెంపు అనివార్యమన్నారు. దీనివల్ల డిస్కమ్‌కు అదనంగా రూ.100.24 కోట్లు సమకూరుతుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఓల్టేజ్ సర్వీసు వ్యయంతో టారిఫ్‌కు లింకు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్ల ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత పర్ కాస్ట్ రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని స్పష్టంచేశారు.

కొనుగోలు ఖర్చు యూనిట్ రూ.4.69

రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్ వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు.

కొత్త ఆర్థిక సంవత్సరంలో గృహ వినియోగం 7,741.84 మిలియన్ యూనిట్లు ఉంటుందని, దాని ద్వారా రూ.3,764.76 కోట్లు వస్తుందని అంచనా వేశారు. వాణిజ్యానికి 1,501.26 మి.యూ. ఇవ్వడం ద్వారా రూ.1,534.45 కోట్లు వస్తుందని, పరిశ్రమలకు 494.59 మి.యూ. ఇవ్వడం వల్ల రూ.406.87 కోట్లు వస్తుందని, వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలకు 4,767.55 మి.యూ. ఇస్తే రూ.1,000.71 కోట్లు వస్తాయని, సంస్థాగతంగా 508.32 మి.యూ.కు రూ.384.32 కోట్లు రావచ్చునని మొత్తం చూసుకుంటే ఎల్‌టీ విభాగంలో 15,013.56 మి.యూ.కు రూ.7,091.11 కోట్లు వస్తాయని అంచనాలు చూపించారు. అదే హెచ్‌టీ విభాగంలో అయితే 14,840.50 మి.యూ.కు రూ.10,673.34 కోట్లు వస్తుందని వివరించారు.

పెండింగ్ కేసులపై చార్జిషీట్లు వేయాలి : డీఎస్పీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు

అనకాపల్లి టౌన్, జనవరి 29: సబ్ డివిజన్ పరిధిలో పెండింగ్ కేసులపై చార్జిషీట్లు వేయాలని అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్ అతిథి గృహం సమావేశమందిరంలో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున ఎస్ఐలు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించాలన్నారు. ముఖ్యంగా శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా విస్తృతం చేయాలని, అవసరమైన వారిని బైండోవర్ చేయించాలని సూచించారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐలు శంకరరావు, రవికుమార్, వినోద్‌బాబు, పైడపునాయుడు, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, స్వామినాయుడు, ఎస్ఐలుపాల్గొన్నారు.

ఉడ్‌పేట పాఠశాలను పరిశీలించిన ఎంపీ సత్యవతి



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్, జనవరి 29: స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి సోమవారం పరిశీలించారు. అనకాపల్లిలో కేంద్రీయ విద్యాలయం మంజూరైన సందర్భంగా ముందస్తుగా తరగతులు నిర్వహించడంలో భాగంగా పాఠశాలను ఆమె పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయం కోసం కేటాయించిన తరగతి గదులను, సంబంధిత విద్యాశాఖ అధికారులతో ఆమె చర్చించారు.

క్లాప్ డ్రైవర్ల నిరసన

అనకాపల్లి టౌన్, జనవరి 29: జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం ఎదుట సోమవారం క్లాప్ డ్రైవర్లు నిరసన తెలియజేశారు. పొద్దుటూరులో క్లాప్ డ్రైవర్ ఆత్మహత్యకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టామని కార్మికసంఘం గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ అన్నారు. పొద్దుటూరు క్లాప్ డ్రైవర్ అంజనేయులుది ఆత్మహత్య కాదని ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు.అతని కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంజనేయులుకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జలగడుగుల శివకుమార్, ఏ. ఏసు, బొమ్మల రాము, సంతోష్ పాల్గొన్నారు.

భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

అనకాపల్లి టౌన్, జనవరి 29 : భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ వైశ్రీరామ్మూర్తి వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వీఆర్వోలు భూముల రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే హౌసింగ్ ఆన్‌లైన్ పనులు త్వరగా చేపట్టాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఆర్ఐ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మండలంలో పలు ప్రారంభోత్సవాలు



వెదురువాడలో లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం, జనవరి 29: మండలంలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు సోమవారం పలు ప్రారంభోత్సవాలు చేశారు. సెజ్ పునరావాస కాలనీలోని షాపింగ్ కాంప్లెక్స్, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్, సచివాలయ భవనం, ఇండోర్ స్టేడియంలను ప్రారంభించారు. అనంతరం వెదురువాడలోని బల్క్‌మిల్క్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, హెల్త్‌క్లినిక్ సెంటర్, అనంతరం మండల కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాలు సభలో పాల్గొన్నారు. పూడిమడకలో రెండు సచివాలయ భవనాలు, హరిపాలెం కైలాస భూమిలో నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, మారిశెట్టి సూర్యనారాయణ, దేశంశెట్టి శంకరరావు, నర్మాల కుమార్, కోన సంధ్య పాల్గొన్నారు. కాగా ప్రారంభోత్సవాలకు అధికారులు ప్రోటోకాల్ పాటించలేదనే విమర్శలున్నాయి. వెదురువాడలో శిలాఫలకంపై సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు పేరు లేదు. అంతేకాక ఆహ్వానం కూడా లేదు. అలాగే సెజ్ పునరావాస కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంపై వైసీపీలో ఒక నాయకుని పేరు ఉంది.

సమస్యలపై స్పందనలో ఫిర్యాదులు

అచ్యుతాపురం, జనవరి 29: మండలంలో పలు సమస్యలపై స్పందనలో వివిధ పార్టీల నాయకులు ఫిర్యాదులు చేశారు. అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు పూర్తిగా శిథిలమైందని, దానిని బాగు చేయించాలని సీపీఎం నాయకులు రొంగలి రాము, కె.రామ సదాశివరావు, కర్రి అప్పారావు తదితరులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. పూడిమడకలో అనధికార లేఅవుట్ వేసి విక్రయాలు జరుపుతున్నారని, అనుమతులు లేవని తెలిసినా పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవడంలేదని జనసేన నాయకుడు ఎరిపిల్లి కాసులు ఫిర్యాదు చేశారు. పెదపాడు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి కుంటుపడుతోందని సర్పంచ్ అరుణ ఆరోపించారు. 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.రెండు లక్షలు దారిమళ్లించారని, అడిగితే సమాధానం లేదన్నారు. ఖారీ క్వారీ వాహనాలు తిరగడం వల్ల రోడ్లు పాడైపోతున్నాయని, జనరల్ బాడీ సమావేశాలు జరగడం లేదని ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి హామీ ఇచ్చారని అరుణ తెలిపారు.

ఎలమంచిలి కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి అనంత్ దరఖాస్తు

అచ్యుతాపురం, జనవరి 29: ఎలమంచిలి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి తిమ్మరాజుపేటకు చెందిన తనకాల అనంతరావు దరఖాస్తు చేశారు. తనకాల అనంతరావు గత 30 సంవత్సరాలుగా పార్టీలో ఉన్నారు. గ్రామస్థాయి నుంచి మండల యూత్, మండల అధ్యక్షునిగా పనిచేసి, ప్రస్తుతం జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా చేస్తున్నారు. సోమవారం ఆయన విజయవాడ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేశారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అనకాపల్లిరూరల్, జనవరి 29: జిల్లాలోని ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద ఆరోపించారు. తుది ఓటర్ల జాబితాలో అవకతవకలపై సోమవారం కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం గోవింద మాట్లాడుతూ కొందరు వలంటీర్లు, బీఎల్‌వోలు కుమ్మక్కు అయి ఓటర్లు బతికుండగానే మరణించినట్టు చూపిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో 1200 మంది టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించారని, వాటిని చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, తలారి కాశీనాయుడు పాల్గొన్నారు.

'స్పందన'లో 20 అర్జీలు

- వైఎస్సార్ బీమా కోసం ఎదురు చూస్తున్నామని.., తమ భూమికి వేరొకరి పేరిట పట్టా ఇచ్చారని.. ఇలా పలువురు గగ్గోలు
- సమస్యలకు పరిష్కారం చూపాలని సిబ్బందికి ఆర్డీవో ఆదేశం



సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జనవరి 29 : స్పందనలో వచ్చే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆర్డీవో హెచ్‌వీ జయరాం అధికారులను ఆదేశించారు. ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం మునిసిపాలిటీ తొమ్మిదో వార్డు, ఐదో సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న జిగిరెడ్డి రామలక్ష్మి వైఎస్సార్ బీమా పథకం డబ్బులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని అర్జీవేను కోరారు. తన భర్త ఏడాది క్రితం చనిపోయారని, వైఎస్సార్ బీమాకు దరఖాస్తు చేసుకుంటే తొలుత రూ.10వేలు ఇచ్చారని, మిగిలిన డబ్బులు ఇప్పటి వరకు మంజూరు కాలేదని విన్నవించారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ తక్షణమే బీమా సొమ్ము మంజూరుకు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కార్యాలయం మేనేజర్‌ను ఆదేశించారు. నర్సీపట్నం మండలం అమలాపురానికి చెందిన ఆర్లి అచ్చియ్యమ్మ తన తల్లిదండ్రులైన రెల్లి గంగయ్యమ్మ, సాంబయ్యతో సహా ఎనిమిది మందికి చెందిన సర్వే నెంబరు 382/1లో 3.10 ఎకరాల పట్టా భూమిని వేములపూడికి చెందిన మరో వ్యక్తి పేరు మీద పట్టా ఇచ్చారని, విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని వేడుకుంది. మునిసిపాలిటీలోని 23వ వార్డు గంగాధర్ థియేటర్ సమీపంలోని జనావాసాల మధ్య ఓ వ్యక్తి కిరోసిన్, సోడా గ్యాస్ విక్రయిస్తున్నారని, బోరు బావి తవ్వించి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి చూస్తున్నారని గుడపర్తి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. కిరోసిన్, సోడా గ్యాస్ వలన ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా డివిజన్ పరిధిలోని ఇరవై మంది తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం : బూడి



రోడ్డు ప్రారంభోత్సవంలో ముత్యాలనాయుడు

దేవరాపల్లి, జనవరి 29 : మండలంలోని చిననందిపల్లి నుంచి చేనులపాలెం గ్రామాలను కలుపుతూ నిర్మించిన పక్కా రోడ్డును సోమవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామ దేవత బంగారమ్మతల్లిని దర్శించుకున్నారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ భాస్కరరావు, కేవీ రమణ, నారాయణమ్మ, సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

104 ఆలయాలకు టీటీడీ నిధులు : ధర్మశ్రీ



విలేకరుల సమావేశంలో విప్ ధర్మశ్రీ, అధికారులు

చోడవరం, జనవరి 29 : నియోజకవర్గంలో 104 దేవాలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు రూ.10.4 కోట్లు మంజూరైనట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ దేవదాయశాఖ అధికారులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు మండలాల్లో మొత్తం 150 ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించగా, అందులో 104 ఆలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించినట్టు చెప్పారు. మిగిలిన ఆలయాలకు కూడా త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయన్నారు. పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరాలయం, గౌరీశ్వరాలయం, కేశవస్వామి ఆలయాల అభివృద్ధికి ప్రసాదం పథకం కింద నిధులు రానున్నాయన్నారు. గౌరీశ్వరాలయం పుష్కరిణి కూడా అభివృద్ధి చేయనున్నామన్నారు. దేవదాయశాఖ డీడీ రాజారావు, ఈవో సత్యనారాయణ, ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, వైసీపీ నాయకులు డీవీఆర్, వెంపలి ఆనంద్, నెహ్రూ, బొడ్డేడ సూర్యనారాయణ, పల్లేటి వెంకటరావు, ఉప్పలబాబు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచబోం

... 5వ పేజీ తరువాయి

చార్జీలను మాత్రం యూనిట్‌కు రూపాయి పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల నుంచి యూనిట్‌కు రూ.5.50 మాత్రమే వసూలు చేస్తున్నామని, సర్వీసు దర 40 శాతం పెరిగిందని, ఈ నేపథ్యంలో పెంపు అనివార్యమన్నారు. దీనివల్ల డిస్కమ్‌కు అదనంగా రూ. 100.24 కోట్లు సమకూరుతుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఓల్టేజ్ సర్వీసు వ్యయంతో టారిఫ్‌కు లింకు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్ల ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత పర్ కాస్ట్ రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని స్పష్టంచేశారు.

కొనుగోలు ఖర్చు యూనిట్ రూ.4.69

రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్ వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు.

కొత్త ఆర్థిక సంవత్సరంలో గృహ వినియోగం 7,741.84 మిలియన్ యూనిట్లు ఉంటుందని, దాని ద్వారా రూ.3,764.76 కోట్లు వస్తుందని అంచనా వేశారు. వాణిజ్యానికి 1,501.26 మి.యూ. ఇవ్వడం ద్వారా రూ.1,534.45 కోట్లు వస్తుందని, పరిశ్రమలకు 494.59 మి.యూ. ఇవ్వడం వల్ల రూ.406.87 కోట్లు వస్తుందని, వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలకు 4,767.55 మి.యూ. ఇస్తే రూ.1,000.71 కోట్లు వస్తాయని, సంస్థాగతంగా 508.32 మి.యూ.కు రూ.384.32 కోట్లు రావచ్చునని మొత్తం చూసుకుంటే ఎల్‌టీ విభాగంలో 15,013.56 మి.యూ.కు రూ. 7,091.11 కోట్లు వస్తాయని అంచనాలు చూపించారు. అదే హెచ్‌టీ విభాగంలో అయితే 14,840.50 మి.యూ.కు రూ.10,673.34 కోట్లు వస్తుందని వివరించారు.

తాగుతూ.. ఊగుతూ..

- పల్లెల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్టుషాపులు
- చాలా చోట్ల కిరాణా, పాన్‌షాపుల్లోనే మద్యం విక్రయాలు
- పోలీస్, ఎస్‌ఈబీ అధికారులు నామమాత్రపు దాడులు
- గిరిజన గ్రామాల్లో యథేచ్ఛగా సారా విక్రయాలు



నాతవరం బెల్టుషాపులో మద్యంతాగి మత్తులో రోడ్డు పక్కన మందుబాబు (ఫైల్)

నాతవరం, జనవరి 29 : పల్లెల్లో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రేయింబవళ్లు ఇక్కడ మద్యం వ్యాపారం జరుగుతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. మండలంలోని చాలాచోట్ల పాన్‌షాపులు, కిరాణా షాపుల్లోనే ఈ వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలు అన్న చందాన సాగుతోంది. అప్పుడప్పుడు నాతవరం పోలీసులు దాడు చేయడం బెల్టు షాపుల వద్ద కొద్దిపాటి మద్యం బాటిళ్లు పట్టుకోవడం మినహా ప్రత్యేక దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు టీడీపీ నాయకుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద బెల్టుషాపుల నిర్వాహకులు ప్రతి బాటిల్‌కు పది రూపాయలు అదనంగా ఇస్తే.. ఎన్ని మద్యం బాటిళ్లు కావాలంటే అన్ని ఇస్తున్నారని ప్రచారంలో ఉంది. ఇలా బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం ఇవ్వకుండా ఉంటే ఈ వ్యాపారాన్ని అరికట్టవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మండల కేంద్రం నాతవరంతో పాటు వెదురుపల్లి గునుపూడి, డి.యర్రవరం, జిల్లేడిపూడి తదితర గ్రామాల్లో ఉదయం ఆరు గంటలకే బెల్టు షాపులలో మద్యం అమ్మకాలు ప్రారంభమవుతాయని అంటున్నారు. రేట్లు కూడా ఎమ్మార్పీ కంటే ఎక్కువగానే ఉంటున్నాయి. మద్యానికి బానిసైన వారు కొందరు ఉదయాన్నే పరగడుపున మద్యాన్ని సేవిస్తుండడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. కొందరు మద్యం మత్తులో ఎక్కడికక్కడ రోడ్లపై పడిపోతున్నారు. ఇది చూసినా ఆయా కుటుంబాలవారు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. బెల్టు షాపుల వలన తమ ఇళ్లు గుల్లవుతున్నాయని, సంసారాలు పాడవుతున్నాయని మహిళలు నెత్తీనోరు బాదుకుంటూ చెపుతున్నా చెవిన వేసుకునేవారు కరువాయ్యారు. ఇదిలావుంటే, మండలంలోని కె.ధర్మవరం నరుగుడు, కేపీ శరభవరం సుందరకోట తదితర గిరిజన గ్రామాలలో మద్యం కొనే స్థోమత లేని గిరిజనులు నాటుసారా తాగుతున్నారు. ఇది ఆరోగ్యానికి మరింత హానికరమని తెలిసినా ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. దీంతో ఆయా కుటుంబాల వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలంతా రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి అరకొర సంపాదన చేయడం, ఆ డబ్బులను మద్యానికి ఖర్చు చేస్తుండడం వల్ల ఇల్లు గడవడం కష్టంగా ఉంటోందని కొందరు గృహిణులు కంటతడి పెడుతున్నారు. కె.ధర్మవరం మహిళలు ఒకడుగు ముందుకు వేసి తమ గ్రామంలో నాటుసారా అమ్మకాలు నిలిపి వేయించాలని నాతవరం పోలీసులను ఆశ్రయించారంటే.. వారు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా పోలీస్, ఎస్‌ఈబీ ఉన్నతాధికారులు స్పందించి మండలంలో బెల్టుషాపులతో పాటు సారా విక్రయాలను అరికట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాల్సిందిగా పలువురు మహిళలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై పోరాటం

- ఆర్టీసీ లీజుకు ఇచ్చిన స్థలాన్ని ప్రజావసరాలకు కేటాయించాలి
- జనసేన డిమాండ్



ఆందోళనలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు రాజు

చోడవరం, జనవరి 29 : పట్టణంలోని దేవదాయ శాఖకు చెందిన స్థలాన్ని ఆర్టీసీ అధికారులు వాణిజ్య అవసరాల కోసం లీజుకు ఇవ్వడం తగదని, ఈ స్థలాన్ని ప్రజా అవసరాల కోసం కేటాయించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు డిమాండ్ చేశారు. సదరు స్థలంలో పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికార పార్టీ నేతల అండదండలతో నియోజకవర్గంలో భూ కబ్జాలు పెరిగిపోయాయని ఆరోపించారు. జనసేన, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే భూ ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు జరిపించి, అన్ని స్థలాలను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. స్థలం లీజు కేటాయింపు వ్యవహారంలో ఆర్టీసీ అధికారులు లోపాయకారీగా తంతునడిపించారని ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం పై పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఆయన కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో జనసేన నాయకులు గూనూరు మూలునాయుడు, వీరమహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

జీడిమామిడి తోటలకు ఈ-క్రాప్ చేయాలి

- వాలాబులో గిరిజనుల ఆందోళన



జీడితోటలో వినాదాలు చేస్తున్న గిరిజనులు

దేవరాపల్లి, జనవరి 29 : కొండ కోనల్లో ఉండే తమకు జీవనాధారమైన జీడి తోటలకు ఈ-క్రాప్ నమోదు చేయాలని మండలంలోని వాలాబు పంచాయతీకి చెందిన గిరిజనులు కోరారు. ఈ మేరకు సోమవారం జీడితోటలో ఆకులు చేతబట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.టి.దొర మాట్లాడుతూ రైతు పండించే ప్రతి పంటను ఈ-క్రాప్ చేయాలని ప్రభుత్వం చెపుతుంటే ఉద్యానవన శాఖాధికారులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వాలాబు పంచాయతీలో 1800 మంది పట్టాదారులు ఉన్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజులు కాకుండా మరో యాభై రోజులు పెంచారని, ఆ ఆపెంచిన దినాలను జీడితోటల్లో తుప్పలు తొలగించుకోవడానికి ఇవ్వాలని కోరారు.

ఆన్‌లైన్‌లో భూమి తొలగింపుపై ఫిర్యాదు

రోలుగుంట, జనవరి 29 : ఎన్నో ఏళ్లగా ఆన్‌లైన్‌లో ఉన్న భూమిని ఇటీవల వెబ్‌ల్యాండ్ నుంచి తనకు తెలియకుండా ఎలా తొలగిస్తారని సోమవారం కొమరవోలు గ్రామానికి చెందిన రైతు సామిరెడ్డి రాజ్‌గోపాల్ రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. సర్వే నెంబరు 107లో 0.55 ఎకరాల భూమి గత పదిహేనేళ్లుగా ఆన్‌లైన్‌లో ఉండేదని, మూడేళ్లపాటు ఆన్‌లైన్ వన్-బి తీసుకుని బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటున్నానని తెలిపారు. ఇటీవల ఆన్‌లైన్‌లో వన్-బి తీయగా హఠాత్తుగా సర్వే నెంబర్ వెబ్‌ల్యాండ్ నుంచి తొలగిపోయిందన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులే సదరు సర్వే నెంబర్‌లో భూమి లేకపోయినా లంచాలు తీసుకుని ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. ఈ విషయంతో తనకు న్యాయం చేయాల్సిందిగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.

సాగు భూములకు పట్టాలు కోరుతూ గిరిజనులు ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

నర్సీపట్నం, జనవరి 29 : గొలుగొండ, నాతవరం మండలాల్లో అటవీ పోడు భూములు సాగు చేస్తున్న తమకు ఆర్‌ఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా పలువురు గిరిజనులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పోడు భూములు సాగు చేసుకుంటున్నా రెవెన్యూ అటవీ అధికారులు గిరిజనులకు పట్టాలు ఇవ్వడం లేదన్నారు. ఆయా భూములలో గిరిజనేతరుల పేర్లు మీద ఉన్న పట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవిలతో పాటు పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి రోజులు'



బి.కింతాడలో టీడీపీ పథకాల పత్రాలు అందజేస్తున్న నాగేశ్వరరావు

దేవరాపల్లి, జనవరి 29 : వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందని, తిరిగి ఆంధ్ర అభివృద్ధి పథంలో పయనించాలంటే చంద్రబాబు వంటి సమర్థ నాయకుడు అవసరమని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కడిం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని బి.కింతాడలో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జగన్ పాలనలో రాష్ట్రంలోని దుస్థితిని వివరించారు. మళ్లీ ప్రజల భవిష్యత్తు బాగుండాలన్నా, ఆంధ్ర అభివృద్ధి సాధించాలన్నా విజన్ ఉన్న చంద్రబాబువంటి నాయకుడు అవసరమని వివరించారు. అనంతరం బాబు ష్యూరిటీ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమార బాబూరావు, వియ్యపు రాజీబాబు, త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

'జల్‌జీవన్'లో కమిటీల ద్వారా మిగులు పనులు

నాతవరం, జనవరి 29 : జల్‌జీవన్ మిషన్ కింద చేపడుతున్న పనులను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీవో ఎస్.హనుమంతరావు సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటైన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో చేపడుతున్న ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద మండలానికి 97 వర్కులు మంజూరు కాగా, 41పనులకు సంబంధించి టెండర్లు పూర్తయినట్టు చెప్పారు. మిగతా వర్కులను కమిటీలు వేసి చేపడతామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రామకృష్ణ, హౌసింగ్ ఏఈ జోగారావు, ఈవోపీఆర్‌డీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : జలజీవన్ మిషన్‌లో మిగులు పనులను పూర్తి చేసేందుకు కమిటీలు వేస్తున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. వెలుగు వీవోలు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. జల్‌జీవన్ మిషన్ పనులు మండలంలో పెండింగ్‌లో ఉంటే కమిటీలను ఏర్పాటు చేసి పూర్తిచేయాలని ఆదేశాలు అందాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హేమంత్ శివకుమార్ రెడ్డి, వెలుగు పథకం ఏరియా కో-ఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములకు టెండర్!

... 5వ పేజీ తరువాయి

తగ్గారు. అయితే సోమవారం అధికారులు ఎవరూ రైతులతో మాట్లాడలేదు. కానీ భూమి చదును పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు భూముల వద్దకు వచ్చి పనులు అడ్డుకున్నారు. అక్కడే టెంట్ వేసి ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా స్థానిక వైసీపీ నాయకుడు రైతులను బెదిరించి సర్వే సంబరు 56/11లో ఐదు ఎకరాల భూమిని కబ్జా చేశాడు. అనంత రం భూమి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించుకున్నాడు. జగనన్న స్మార్ట్ సిటీ కోసం పేద రైతుల భూములను స్వాధీనం చేసుకున్న అధికారులు.. సదరు అధికార పార్టీ నేత ఆధీనంలో వున్న భూమిని వదిలేశారు.

వైసీపీ కేడర్‌లో అసంతృప్తి సెగలు

... 5వ పేజీ తరువాయి

వచ్చిన సదరు కార్యకర్త... శంబంగి మంచివాడైనప్పటికీ బేబీ నాయనను తట్టుకోలేరని, ఓడిపోయే చాన్స్ ఉందంటూ విశ్లేషించారు. ఇక్కడ నుంచి జడ్పీ చైర్మన్ చిన్న శ్రీనును బరిలోకి దించితే కొంతవరకూ పోటీ ఇచ్చే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. ఇలా... మరికొన్ని నియోజకవర్గాల నుంచి వచ్చిన వైసీపీ కార్యకర్తలు కూడా స్థానిక ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో తమకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని వాపోయారు. పార్టీ సమావేశాలకు, సభలకు రావడం తప్ప...కనీసం ఇల్లు కూడా పొందలేక పోయామంటూ నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన ఒక కార్యకర్త వాపోయాడు. గ్రామ/మండల స్థాయిల్లో స్థానిక నేతల వ్యవహారశైలి వల్లే పార్టీపై వ్యతిరేకత పెరిగిందన్నారు.

షర్మిల ప్రభావంపై చర్చ

సభా ప్రాంగణంలో వైసీపీ కార్యకర్తలు షర్మిల ప్రభావంపైనా చర్చించుకుంటూ కనిపించారు. ఈసారి షర్మిల వల్ల కొంత ఓట్లు నష్టపోతామని కొందరు విశ్లేషించారు. షర్మిల చేస్తున్న తీవ్ర విమర్శలు పార్టీకి దెబ్బేనని ఆందోళన వ్యక్తంచేశారు. షర్మిలకు జగన్ ఏదో ఒక పదవి ఇచ్చేస్తే సరిపోయేదని, అలా చేయకుండా సమస్యను పెంచుకున్నాడంటూ పలువురు కార్యకర్తలు విశ్లేషించారు.

'రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు'

చీడికాడ, జనవరి 29 : రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని క్వాలిటీ కంట్రోల్ విభాగం డీఈఈ బాస్కర్ హెచ్చరించారు. మండల కేంద్రం చీడికాడలో రోడ్లు, భవనాల శాఖ ద్వారా నిర్మిస్తున్న రోడ్డు నాణ్యతను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నిర్మాణ పనులు పక్కా నాణ్యతతో సాగాలన్నారు. ఎటువంటి లోపాలున్నా కాంట్రాక్టర్లకు బిల్లులు నిలుదల చేస్తామన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ పి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డులు పొందిన అధికారులకు సత్కారం

మాడుగుల రూరల్, జనవరి 29 : ఉత్తమ అధికారులుగా అవార్డులు పొందిన వారిని సోమవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శులు శంకర్, విశాలాక్షిలు గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి నుంచి అనకాపల్లిలో అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. వీరిని మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో పాటు పంచాయతీల కార్యదర్శులు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ పురస్కారాలు మరింత బాధ్యతలను పెంచాయన్నారు.

గ్రామ కంఠం కబ్జా

... 5వ పేజీ తరువాయి

చేయించారు. రేపోమాపో నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆక్రమ ణకు గురైన స్థలం విలువ రూ.ఐదారు కోట్లు వుంటుందని స్థానికులు చెబుతున్నారు.

పలుమార్లు ఫిర్యాదు చేసినా...

కె.కోటపాడు మండలం కె.సంతపాలెం పంచాయతీ కె.కె.అగ్రహారంలో గ్రామకంఠం భూమి ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై గత ఏడాది నవంబరు 29వ తేదీన కె.కోటపాడులో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జేసీ జాహ్నవి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో గ్రామానికి చెందిన సీహెచ్ రమణ ఆధ్వర్యంలో పలువురు ఫిర్యాదు చేశారు. తరువాత స్థానిక తహసీల్దార్‌కు కూడా పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఎటువంటి చర్యలు చేపట్టక పోగా.. గ్రామ కంఠం స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాగా గ్రామకంఠం స్థలం ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్‌లపై కె.కోటపాడు తహసీల్దారు రమేశ్‌బాబును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా... ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, గ్రామ కంఠం భూముల వివరాలు పంచాయతీ కార్యదర్శి వద్ద ఉంటాయని, పూర్తి వివరాలు సేకరించి భూ ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్ జరిగి వుంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రచారం'

నర్సీపట్నం, జనవరి 29 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై ఫిబ్రవరి ఒకటో తేదీనుంచి విస్తృత ప్రచారం నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఏర్పాటైన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. గతంలో కేంద్రంలోని ప్రభుత్వాలు పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తే, బీజేపీ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు. ఈ కారణంగానే నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని, నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలను కేంద్రం విస్మరిస్తే అడగలేని పరిస్థితిలో వైసీసీ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి, ఐద్వా ప్రతినిధులు ఎల్ గౌరీ, సూర్యప్రభ, అడిగర్ల రాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి ఎండు గడ్డి దగ్ధం

బుచ్చెయ్యపేట, జనవరి 29 : ట్రాక్టర్‌పై తీసుకు వెళుతున్న గడ్డికి విద్యుత్ తీగలు తగడంతో దగ్ధమైంది. ఇందుకు సంబంధించిన వివరాలివి. ఎం.అప్పారావు అనే రైతు పొలంలోని వరి కుప్పను నూర్చాడు. అనంతరం వచ్చిన గడ్డిని సోమవారం ట్రాక్టర్‌పై ఇంటికి తరలిస్తున్నాడు. వడ్డాదిలోని కస్పా రోడ్డుకు వచ్చే సరికి విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు వ్యాపించాయి. దీంతో గడ్డి దగ్ధమైంది. చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

శాఖా గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు

దేవరాపల్లి, జనవరి 29 : ఇక్కడి శాఖా గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు ఉపయోగపడే కొత్త పుస్తకాలు చేరాయి. వీటి ద్వారా ఆయా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు, విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలనుకునే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు కోరారు.

గొండుపాలెంలో 230 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు, జనవరి 29 : గొండుపాలెంలో సంఘమిత్ర రూరల్ డెవలప్ మెంటు సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు తదితరాలకు సంబంధించి 230 మందికి పరీక్షలు జరిపారు. ఇందులో భాగంగా ఇరవై మందికి వినికిడి యంత్రాలు అందజేశారు. కేజీహెచ్ అసోసియేటెడ్ ప్రొఫెసర్ బండారు రామచంద్రరావు, వైద్య నిపుణులు సుధీర్, కావ్య, శైలజ, సందీప్, శ్రీకాంత్, రమణ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'పరీక్ష పే'ను వీక్షించిన తూటిపాల విద్యార్థులు

మాకవరపాలెం, జనవరి 29 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మక పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు సోమవారం స్మార్ట్ టీవీ ద్వారా వీక్షించారు. అనంతరం హెచ్ఎం కోసూరు రాము మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విద్యార్థులు గతంలో అడిగిన ప్రశ్నలకు ప్రధానమంత్రి మోదీ సమాధానాలు ఇచ్చారన్నారు. పరీక్షల్లో ఒత్తిడిని ఏ విధంగా జయించాలో వివరించినట్టు చెప్పారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

నర్సీపట్నం అర్బన్, జనవరి 29 : పట్టణంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు సోమవారం ముగిశాయి. పురుషులు, మహిళల విభాగాల్లో జరిగిన కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్టు ఎంపీడీవో జయమాధవి తెలిపారు.

నేడు జిల్లాస్థాయి ఎడ్ల పరుగు, కబడ్డీ పోటీలు

చీడికాడ, జనవరి 29 : బైలపూడిలో గ్రామ దేవత నాగపేరంటాలు తీర్థం మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు నిర్వాహకులతో పాటు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు, కబడ్డీ పోటీలు నిర్వహిస్తు న్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఔత్సాహికులు తమ పేర్లను నిర్వాహకుల వద్ద నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు.

'కో-ఆపరేటివ్ బ్యాంకు సీఈవోను తొలగించాలి'

మాకవరపాలెం, జనవరి 29 : మాకవరపాలెం కో-ఆపరేటివ్ బ్యాంకు సీఈవోగా ఉన్న శీరంరెడ్డి గోవిందను తొలగించాలంటూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొంతు రమణ స్పందనలో జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే కేసు శీరంరెడ్డి గోవిందపై ఉందన్నారు. అప్పటిలో విధుల నుంచి ఆయనను సస్పెండ్ చేయగా, అధికార పార్టీకి చెందిన నామినేటెడ్ బోర్డు నియమించుకుందని ఆరోపించారు. కోట్లాది రూపాయల లావాదేవీలు నిర్వహించే ఈ బ్యాంకులో ఇటువంటి వారిని తొలగించాలని స్పందనలో కలెక్టర్‌కు విన్నవించినట్టు చెప్పారు.

చెరకు కాటా వద్ద రైతుల నిరసన

దేవరాపల్లి, జనవరి 29: తూనిక కేంద్రాల వద్ద చెరకు వారాల తరబడి పేరుకుపోవడం వల్ల బరువు తగ్గి రైతుకు నష్టం జరుగుతుందని, వెంటనే తూకం వేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, వనుం సూర్యనారాయణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూరెడ్డిపాలెం చెరకు కాటా వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఇప్పటికే వారం రోజులుగా కాటాకు తెచ్చిన చెరకు తూనిక వేయలేదన్నారు. తూనిక వేసిన చెరకుకు వెంటనే నగదు చెల్లించాలన్నారు. వనుం సత్యం, రామునాయుడు, తాతబాబు, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

నేడు చీడికాడ మండల సమావేశం

చీడికాడ, జనవరి 29 : ఇక్కడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన ప్రారంభం కానుంది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాల్సిందిగా ఎంపీడీవో జయప్రకాశరావు కోరారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి

చోడవరం, జనవరి 29 : పట్టణంలోని ఆర్టీసీ స్థలం లీజు వల్ల కాంప్లెక్స్ దిగువన ఉన్న చెరువు ఆయుకట్టుదారులకు తీరని అన్యాయం జరుగుతుందని, తక్షణమే లీజు రద్దుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు కలెక్టర్‌కు సోమవారం విజ్ఞప్తి చేశారు. దేవదాయ శాఖ స్థలాన్ని ఆర్టీసీ అధికారుల లీజుపేరుతో వాణిజ్య సముదాయాలకు ఇవ్వడం వల్ల చెరువుకు వచ్చే నీటివనరులు తగ్గిపోవడంతో పాటు, పట్టణంలో వానాకాలంలో పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకునిపోతాయని వివరించారు. పాత చెరువు కింద సుమారు 16 వందల ఎకరాల ఆయుకట్టు ఉందని, ఈ స్థలాన్ని కప్పేస్తే రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

నాతవరం, జనవరి 29 : మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన సచివాలయ, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే గణేశ్ మంగళవారం ప్రారంభిస్తారని ఎంపీపీ లక్ష్మణమూర్తి, నాయకులు లగుడు నాగేశ్వరరావు, పైల సునీల్, అడిగర్ల నాయుడు, రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమాలను అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు.